


sahanamvande.com

epaper.sahanamvande.com

# సహనం వందే

హైదరాబాద్ | 14-10-2026 బుధవారం | సంపుటి-02 సంచిక : 171 EDITOR: ROHINI





# ఎర్రజెండా నీడలో కాంగ్రెస్ ఎజెండా!

## రాహుల్‌తో చెయ్యి కలిపిన నేహా బోరా



రాహుల్ గాంధీతో నేహా బోరా

**ఢిల్లీలో జరిగిన నిరసన ప్రదర్శనలో ప్రియాంక గాంధీతో కలిసి నడిచిన నేహా బోరా ఉదంతం రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చకు దారితీసింది. కాంగ్రెస్ పార్టీ విద్యార్థి, యువజన విభాగాల్లోని నేతలు ఆమెను చూసి ఆశ్చర్యపోవాల్సి వస్తోంది. గతంలో జేఎన్ యూ విద్యార్థి సంఘం ఎన్నికల్లో ఐసా తరపున ఉపాధ్యక్షురాలిగా ఎన్నికైన షెహ్లా రషీద్ ఒక వెలుగు వెలిగారు. ఆ తర్వాత ఆమె కమ్యూనిస్ట్ భావజాలానికి దూరమై మోదీ ప్రభుత్వంపై సానుకూల ధోరణి ప్రదర్శించడం అందరినీ విస్మయానికి గురిచేసింది. - సహనం వందే, న్యూఢిల్లీ**

- వామపక్ష యువతకు రాహుల్ గాలం
- ఢిల్లీ వీధుల్లో యువ నాయకత్వం
- భావజాలాల నడుమ భిన్న నాయకత్వం

ఢిల్లీ నిరసనల్లో రాహుల్, ప్రియాంక గాంధీలతో కలిసి నడిచిన యువ నేత నేహా బోరా వైరల్‌గా మారారు. కన్హయ్య కుమార్ నుంచి నేహా వరకు కమ్యూనిస్ట్ నేపథ్యం ఉన్న నేతలు కాంగ్రెస్ పార్టీ వైపు ఎందుకు ఆకర్షితులవుతున్నారనేది చర్చ. కాంగ్రెస్ సొంతంగా ఉద్యమ నాయకులను ఎందుకు తయారుచేసుకోలేకపోతోందనే ప్రశ్న రాజకీయ వర్గాల్లో ఉత్పన్నమవుతోంది. సీపీఐ(ఎంఎల్) నాయకులు మాత్రం నేహా బోరాను పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి ఉన్న నేతగా పేర్కొంటూ... తమ పార్టీ విజయంగా భావిస్తున్నారు.

### కాంగ్రెస్‌లో కొరవడిన ఉద్యమస్ఫూర్తి...

సుదీర్ఘకాలం అధికారంలో ఉండటం వల్ల కాంగ్రెస్‌కు ప్రతిపక్ష పాత్రను సమర్థంగా పోషించే అలవాటు తప్పిందని విశ్లేషకులు భావిస్తున్నారు. ఆరేడు దశాబ్దాల పాటు పాలనకే పరిమితమవ్వడం వల్ల నిత్యం ప్రజాసమస్యలపై పోరాడి నాయకులను తయారుచేసే మేధోపరమైన శక్తి తగ్గింది. కాంగ్రెస్‌ను పూర్తిస్థాయి పోరాటాల బాట పట్టించేందుకు రాహుల్ గాంధీకి దాదాపు పద్నాలుగేళ్ల సుదీర్ఘ సమయం పట్టింది. కేవలం అధికారం కోసం కాకుండా పోరాటమే అసలైన మార్గమని పార్టీ శ్రేణులకు నమ్మకం కలిగించాల్సి వచ్చింది.

### కమ్యూనిస్ట్ నేతల భావజాల పరివర్తన

వామపక్ష ఉద్యమాల ద్వారా ఎదిగిన కన్హయ్య కుమార్, ఉమర్ ఖలీద్, నేహా బోరా వంటి నేతలు ప్రజా క్షేత్రంలో గుర్తింపు పొందారు. అయితే కమ్యూనిస్ట్ పార్టీలను వీడి సంప్రదాయ కాంగ్రెస్ పార్టీలో చేరాక కన్హయ్య శైలి, మాట్లాడే విధానంలో మార్పు వచ్చిందని విమర్శలు ఉన్నాయి. ప్రధాన స్రవంతి ప్రజాస్వామ్య రాజకీయాల్లోకి వచ్చినప్పుడు విస్తృత ప్రజామోదం పొందేందుకు భాష, శైలి మారడం సహజమైనప్పటికీ, ఆయనకు ఉన్న ప్రత్యేక పోరాట గుర్తింపు కొంతవరకు బలహీనపడిందనే భావన ఉంది.

### పరిమిత వర్గ పోరాటాల పరిమితులు...

కమ్యూనిస్ట్ పార్టీలు కేవలం నిర్దిష్ట వర్గాల సమస్యలపైనే దృష్టి సారిస్తాయని, అయితే ప్రజాస్వామ్య రాజకీయాల్లో అందరినీ కలుపుపోయే ఏకాభిప్రాయం అవసరమని నిపుణులు స్పష్టం చేస్తున్నారు. సామాజిక న్యాయం కోసం పోరాడే ఇతర ప్రాంతీయ పార్టీలలోనూ ఈ పరిమితి స్పష్టంగా కనిపిస్తోంది. సంప్రదాయ పార్టీల వలయంలో చిక్కుకున్నప్పుడు ఉద్యమ నేపథ్యం ఉన్న నేతలకు తగినంత రాజకీయ స్వేచ్ఛ లభించకపోవడం వల్ల వారి స్వరం మారుతోందనేది చారిత్రక నైజం.

### అధికార రాజకీయాల్లో సిద్ధాంతాలకు సవాల్...

వామపక్ష విద్యార్థి సంఘాల నుండి వచ్చి కాంగ్రెస్ అగ్రనేతల సరసన నిలిచిన నేహా బోరా ప్రయాణం ఆసక్తికరమైన రాజకీయ పరిణామం. ఉద్యమాల గర్భంలో నుండి పుట్టుకొచ్చిన యువ గొంతుకలు అధికార రాజకీయాల నీడలో తమ మూల సిద్ధాంతాలను ఎంతవరకు నిలబెట్టుకోగలరనేది కాలమే నిర్ణయిస్తుంది. ప్రజాస్వామ్య రాజకీయాల వలయంలో చిక్కుకున్నప్పుడు వారి అసలైన పోరాట స్ఫూర్తి ఏమవుతుందనే ప్రశ్న మిగిలే ఉంది.



విద్యార్థి నేత నేహా బోరా

# ఆయిల్‌పామ్ రైతులకు ముప్పు?

## అన్నదాతలకు మాయగాళ్ల వల

- తెలుగు రాష్ట్రాల తోటలపై దొంగ ప్రచారాలు
- ఫైటోఫ్తోరా ఫంగస్ ఉందంటూ దుష్ప్రచారం
- నకిలీ మందులు అమ్ముతున్న వ్యాపారులు

**కష్టపడి పంట పండించే రైతును ఆదుకోవడానికి వాన దేవుడు కరుణిస్తాడో లేదో తెలియదు గానీ, వాళ్ల భయాన్ని ఆసరాగా చేసుకుని జేబులు గుల్ల చేసే కేటుగాళ్లు మాత్రం ఎప్పుడూ రెడీగా ఉంటారు. ఆయిల్ పామ్ తోటలకు అదిగో తెగులు వచ్చేసింది, ఇదిగో చెట్లు ఎండిపోతాయి అని వీడియోలు చూసి కంగారు పడుతున్నారా? అసలు మీ తోటల్లో నిజంగానే తెగులు ఉందా లేక అదంతా మిమ్మల్ని బురిడీ కొట్టించే డ్రామానా? అసలు వాస్తవాలు ఏంటో తెలుసుకుందాం. - సహనం వందే, అశ్వారావుపేట**



తెలంగాణ రాష్ట్రంలో ఆయిల్‌పామ్ సాగు విస్తీర్ణం వేలాది ఎకరాల్లో వేగంగా విస్తరిస్తోంది. ముఖ్యంగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 92,525 ఎకరాలు, ఖమ్మం జిల్లాలో 49,993 ఎకరాల్లో ఈ పంటను రైతులు సాగు చేస్తున్నారు. ఆయిల్ పామ్ తోటల ద్వారా రైతులకు ఎకరాకు సగటున లక్ష రూపాయల నుండి లక్షా పాతిక వేల రూపాయల వరకు మంచి ఆదాయం లభిస్తోంది. ఎంతో పెట్టుబడి పెట్టి పెంచుకుంటున్న ఈ తోటలకు ఏదైనా తెగులు సోకితే ఎక్కడ నష్టం వస్తుందో అన్న భయం ప్రతీ రైతులోనూ సహజంగానే ఉంటుంది.

### ఫైటోఫ్తోరా పాల్మివోరా ఫంగస్ పేరు చెప్పి...

రైతుల్లో ఉన్న ఇదే భయాన్ని,ఆందోళనను కొంతమంది కేటుగాళ్లు తమ స్వార్థం కోసం వాడుకుంటున్నారు. ఫైటోఫ్తోరా పాల్మివోరా అనే ఫంగస్ తెగులు ఆయిల్‌పామ్ తోటలను నాశనం చేస్తోందని పెద్ద ఎత్తున అసత్య ప్రచారాలు మొదలుపెట్టారు. ఈ ఫంగస్ సోకితే తోటలు మొత్తం పూర్తిగా ఎండిపోతాయని రైతులను తీవ్రంగా భయపెడుతున్నారు. ఇలా భయపెట్టిన వెంటనే తమ కంపెనీలకు చెందిన ఆర్గానిక్ ఉత్పత్తులు, మందులు వాడితేనే తోటలు కాపాడుకోగలరని ప్రచారం చేస్తున్నారు.

### మోసపోతున్న రైతులు...

అసలు తోటల్లో నిజంగానే ఫంగస్ ఉందా లేదా అని నిర్ధారించుకోకుండానే ఈ వ్యాపారులు నకిలీ, అనవసరమైన మందులను రైతులకు అంటగడుతున్నారు. అమాయక రైతులు వారి మాటలు నిజమేనని నమ్మి వేలకు వేలు తగలేసి ఆ మందులను కొనుగోలు చేస్తూ మోసపోతున్నారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ పరిధిలోని ఆయిల్ పామ్ రైతులను లక్ష్యంగా చేసుకుని ఈ కేటుగాళ్లు తమ వ్యాపారాన్ని విస్తరిస్తున్నారు. ఆన్ లైన్ లో కనిపించే ప్రచారాల వెనుక ఉన్న వ్యాపార స్వార్థాన్ని రైతులు గమనించలేకపోతున్నారు.

### శాస్త్రవేత్తలను కలిసిన రైతులు...

ఈ ప్రచారాలపై అనుమానం వచ్చిన కొందరు ఖమ్మం జిల్లా రైతులు నేరుగా రంగంలోకి దిగారు. ఆంధ్రప్రదేశ్ ఏలూరు సమీపంలో ఉన్న అశ్వారావుపేట,పెదవేగిలోని భారతీయ ఆయిల్ పామ్ పరిశోధనా సంస్థ శాస్త్రవేత్తలను కలసి పరిస్థితిని వివరించారు. తమ తోటల్లో నిజంగానే ఈ ఫంగస్ ఉందా లేదా అని స్వయంగా తనిఖీ చేసి నిర్ధారించాలని విజ్ఞప్తి చేశారు. అశ్వారావుపేట జోనల్ సొసైటీ ప్రతినిధులు కూడా ఈ విషయంపై పరిశోధనా సంస్థకు అధికారికంగా వినతిపత్రం సమర్పించారు.

### మధుసూదన్ భరోసా...

రైతుల విజ్ఞప్తిపై స్పందించిన జిల్లా ఉద్యానవన, పట్టు పరిశ్రమల శాఖ అధికారి ఎం.వి. మధుసూదన్... రైతులకు భరోసా ఇచ్చారు. తెలంగాణలో ఇప్పటివరకు ఎక్కడా ఈ ఫంగస్ తెగులు నమోదవలేదని ఆయన స్పష్టం చేశారు. తప్పుడు ప్రచారాలను, పుకార్లను నమ్మి రైతులు ఎవరూ ఆందోళన చెందవద్దని కోరారు. రైతులు లేవనెత్తిన అనుమానాలను నివృత్తి చేసేందుకు త్వరలోనే శాస్త్రవేత్తల బృందం తోటలను సందర్శించి తనిఖీలు చేస్తుందని వెల్లడించారు.

### అనవసర భయాలు వద్దు...

ఒకవేళ మీ ప్రాంతంలో ఎవరైనా వ్యక్తులు లేదా కంపెనీల ప్రతినిధులు వచ్చి లేని తెగుళ్ల పేరు చెప్పి మందులు అమ్మడానికి ప్రయత్నిస్తే జాగ్రత్తపడండి. వారి లైసెన్సులు, ప్రభుత్వం గుర్తించిన పత్రాలను సరిచూసుకోవడం చాలా ముఖ్యం. ఒక్కరి అప్రమత్తత ఊరందరి పంటను, డబ్బును కాపాడుతుంది.

# మరణమే మార్గం... టెక్కీల శోకం

## ఇద్దరు సాఫ్ట్‌వేర్ ఉద్యోగుల మృతి

- 30వ అంతస్తు నుండి పడిన భరత్
- ఇక సొంత ఫ్లాట్‌లో మరొకరి మృతి
- టెక్కీలపై ఒత్తిడి... మిస్టరీగా మరణాలు

**మన సాఫ్ట్‌వేర్ ఉద్యోగులకు అసలు ఏమవుతోంది? రేపో మాపో మంచి భవిష్యత్తు ఉంటుందనుకున్న ప్రాణాలు ఇలా అర్ధాంతరంగా గాల్లో కలసిపోతుంటే ఏం అనాలి? నగరంలో ఒకేసారి ఇద్దరు ఐటీ ఉద్యోగులు ప్రాణాలు కోల్పోవడం ఇప్పుడు తీవ్ర కలకలం రేపుతోంది. ఒకరు భవనం పైనుంచి పడి చనిపోతే, ఇంకొకరు మూసిన తలపుల వెనుక శవమై తేలారు. - సహనం వందే, హైదరాబాద్**



నానక్‌రామ్‌గూడలోని గోల్ఫ్ ఎడ్జ్ అపార్ట్‌మెంట్స్ 30వ అంతస్తు నుండి కింద పడి ఉప్పల భరత్ అనే 29 ఏళ్ల సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ ప్రాణాలు కోల్పోయాడు. సూర్యాపేట జిల్లాకు చెందిన భరత్ బెంగళూరులోని ఒక సాఫ్ట్‌వేర్ కంపెనీలో పనిచేస్తున్నాడు. ఈ ఘటన జరగడానికి కేవలం రెండు రోజుల ముందే అతను ఈ అపార్ట్‌మెంట్‌లోని ఒక అద్దె ఫ్లాట్‌లోకి మారడం గమనార్హం.

### పార్కింగ్‌లో వాహనంపై పడి

సోమవారం ఈ దారుణం జరిగింది. అపార్ట్‌మెంట్ కాంప్లెక్స్ పార్కింగ్ ప్రాంతంలో నిలిపి ఉంచిన ఒక వాహనంపై భరత్ పడిపోవడంతో తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే అతన్ని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించినా ఫలితం లేకుండా పోయింది, వైద్యులు మరణించినట్లు చెప్పారు. భరత్ బంధువు ఉప్పల కిషోర్ ఫిర్యాదుతో గచ్చిబౌలి పోలీసులు కేసు నమోదు చేసి మృతదేహాన్ని ఉస్మానియా జనరల్ ఆసుపత్రికి పంపారు.

### కొండాపూర్‌లో ఇంకో ఘోరం

మరోవైపు కొండాపూర్‌లోని తన స్నేహితుడి ఫ్లాట్‌లో ఆదివారం 36 ఏళ్ల సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడిని సౌరభ్ శేఖర్‌గా గుర్తించామని, అతను దీర్ఘకాలిక అనారోగ్యంతో బాధపడుతున్నాడని పోలీసులు చెప్పారు. హర్యానాకు చెందిన సౌరభ్... రాయదుర్గంలోని ఒక ప్రైవేట్ కంపెనీలో పనిచేస్తూ ఇనార్బిట్ మాల్ సమీపంలో తన తమ్ముడితో కలిసి నివసిస్తున్నాడు.

### వాట్సాప్ మెసేజే చివరి మాట

శనివారం సాయంత్రం స్నేహితుడిని కలవడానికి వెళ్తున్నట్లు తమ్ముడికి చెప్పి ఫ్లాట్ నుండి బయటకు వెళ్లాడు. కుటుంబ సభ్యుల వాట్సాప్ గ్రూప్‌లో స్నేహితుడి అపార్ట్‌మెంట్ చిరునామాను పంపడమే అందరితో జరిగిన చివరి సంభాషణ. ఆదివారం ఉదయం కుటుంబ సభ్యులు ఫోన్ చేసినా తీయకపోవడంతో తమ్ముడు ఆ చిరునామాకు వెళ్లి చూశాడు. అక్కడ తలుపులు లోపలి నుంచి తాళం వేసి ఉన్నాయి.

### తలుపులు బద్దలు కొట్టి చూస్తే...

సోదరుడు ఇచ్చిన సమాచారంతో పోలీసులు అక్కడికి చేరుకుని డోర్ బలవంతంగా ఓపెన్ చేశారు. లోపలికి వెళ్ళి చూడగా సౌరభ్ విగతజీవిగా పడి ఉన్నాడు. ఐటీ రంగంలో పెరుగుతున్న మానసిక ఒత్తిడి, ఉద్యోగ భద్రత లేకపోవడం, అనారోగ్య సమస్యలు సాఫ్ట్‌వేర్ ఉద్యోగుల జీవితాలను ఎంతగా దెబ్బతీస్తున్నాయో ఈ రెండు సంఘటనలు స్పష్టంగా చూపిస్తున్నాయి.